PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 233 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- సోమవారం 19 ఆగస్టు 2024

## మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్కాం




## రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ నేతలే అంటున్నారు : మాజీ మంత్రి హరీష్ రావు






## 2026లోనే శాసనసభ స్థానాల పెంపు: స్పష్టం చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలలో శాసనసభ స్థానాల పెంపు 2026లోనేనని కేంద్రం స్పష్టం చేసింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 (3) ప్రకారం 2026లో జనాభా లెక్కల అనంతరమే ఏపీలో 175 నుంచి 225 శాసనసభ స్థానాలుతెలంగాణలో 119 నుంచి 153 శాసనసభ స్థానాల పెంపునియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడే ఎస్సీ ఎస్టీ స్థానాల పునఃసర్దుబాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభ జన చట్టం -2014ను న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా మార్చి1, 2014న గెజిట్ లో ప్రచురించినట్లు వివరించింది.లోక్ సభలో తెరాస ఎంపీ బాల్కసుమన్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హరిభాయ్ చౌదరి ఈ మేరకు లిఖిత పూర్వకంగా సమాధానం తెలిపారు.

## పేద 'రాజు'లకు సీఎం రేవంత్ రెడ్డి

# గుడ్ న్యూస్



**హైదరాబాద్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో క్షత్రియ భవన్‌కు అవసరమైన స్థలాన్ని ఇస్తామని, నిర్మాణానికి అవసరమైన అనుమతులు కూడా ఇస్తామని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదే తీరుల ప్రభుత్వానికీ తగిన సహకారం అందించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీగా ఫోర్త్ సిటీని నిర్మిస్తున్నదని, అందులో వివిధ రంగాలకు చెందిన పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. క్షత్రియ సేవా సమితి నిర్వహించిన సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ ప్రసంగిస్తూ... హైదరాబాద్ సిటీ అభివృద్ధిలో వేర్వేరు రూపాల్లో 'రాజు'ల కృషి, పట్టుదల, సహకారం ఉన్నదని, రానున్న ఫోర్త్ సిటీలో సైతం అదే కొనసాగాలని ఆకాంక్షించారు. క్షత్రియుల్లోనూ పేదలు ఉన్నారని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తామని, అర్హులైనవారి వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. నిబద్ధత, కష్టపడేతత్వం, పట్టుదల ఉండే క్షత్రియుల సహకారాన్ని ప్రభుత్వం కోరుతున్నదన్నారు.చరిత్రలో క్షత్రియుల గొప్పదనానికి సంబంధించి అనేక ఉదాహరణలు ఉన్నాయని, ఉమ్మడి రాష్ట్రంలో 1960వ దశకంలో వ్యవసాయంలో కొత్త వంగడాలను పరిచయం చేశారని, అప్పట్లో గ్రామంగా ఉన్న కొంపల్లి ఇప్పుడు నగరంగా వృద్ధి చెందిందని గుర్తుచేశారు. ఐటీ రంగంలో సత్యం రామలింగరాజు మొదలు మీడియాలో కూడా అనేక మంది క్షత్రియుల పాత్ర ఉన్నదని, ఇక ఫార్మా, మెడికల్, ఇండస్ట్రీ, రియల్ ఎస్టేట్.. ఇలా అన్నింటా వారి స్థానం కనిపిస్తుందన్నారు. ఆయా రంగాలు వృద్ధి చెందడానికి పెట్టుబడులొక్కటే కారణం కాదని, దాని వెనక కృషి, పట్టుదల, శ్రమ, కమిట్‌మెంట్, ట్రస్ట్, కష్టపడేతత్వం లాంటివి కూడా ఉన్నాయని, అందులో రాజులు ఏ రంగంలో ప్రవేశించినా తప్పకుండా రాణిస్తారనే గుర్తింపు లభించిందన్నారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీలో సైతం తాను క్షత్రియుల నుంచి ఇదే కోరుకుంటున్నానని, వారు అన్ని విధాలా వివరాలు 2లో



## నేడు తిరుపతిలో పర్యటించనున్న

# సీఎం చంద్రబాబు

**అమరావతి:ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబు రేపు తిరుపతి శ్రీ సిటీలో పర్యటించనున్నారు. శ్రీ సిటీలోని పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. శ్రీ సిటీలో 15 సంస్థల కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. మరో 7 సంస్థలకు శంకుస్థాపన చేయనున్నారు. ఆయా సంస్థల ద్వారా రూ.900 కోట్ల పెట్టుబడితో 2,740 మందికి ఉపాధి లభించనుంది. మరో 1,213 కోట్ల పెట్టుబడికి ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది.రేపటి పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు శ్రీ సిటీ బిజినెస్ సెంటర్ లో పలు కంపెనీల సీఈవోలతో సమావేశం కానున్నారు. కాగా, చంద్రబాబు రేపు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనూ పర్యటించనున్నారు. ఇక్కడి సోమశిల ప్రాజెక్టును సందర్శించనున్నారు. సోమశిలలో వరదలకు దెబ్బతిన్న కట్ట పనులను పరిశీలించనున్నారు.

## కోల్‌కతా ఘటనపై నేడు సుప్రీంకోర్టులో విచారణ



**కోల్‌కతా:ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కోల్ కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో నైట్ డ్యూటీలో ఉన్న ట్రెయినీ డాక్టర్ పై హత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.కాగా, ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో సోమవారం నాడు విచారణ జరగనుంది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారణ జరపనుందని సుప్రీంకోర్టు వెబ్ సైట్ లో తెలిపారు. ఈ బెంచ్ లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తో పాటు, జస్టిస్ జేబీ పార్ధీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా ఉన్నారు. కాగా, కోల్ కతా హత్యాచార ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించాలంటూ సీజేఐ డీవై చంద్రచూడ్ ను ఉద్దేశించి మోనికా సింగ్ అనే వైద్యురాలు ఓ లేఖలో విజ్ఞప్తి చేశారు. తక్షణమే నిష్పాక్షిక దర్యాప్తు జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని ఆమె అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

## కాంగ్రెస్ పెద్దలకు

# కేటీఆర్ లేఖ..



**హైదరాబాద్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ అంశంలో రైతుల పట్ల నమ్మకద్రోహానికి పాల్పడిందంటూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.ఈ మేరకు ఆయన కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు లేఖాస్త్రం సంధించారు. తెలంగాణలోని లక్షలాది మంది రైతుల తరఫున ఈ లేఖ రాస్తున్నానని, రుణ మాఫీ చేస్తామన్న హామీ విషయంలో కాంగ్రెస్ సర్కారు రైతులను తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఘనంగా ప్రకటించారని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉందని, అరకొర రుణమాఫీతో సరిపెడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో లక్షల సంఖ్యలో రైతులు ఉండగా, వారిలో రుణమాఫీ అందనివారే ఎక్కువమంది ఉన్నారని కేటీఆర్ వెల్లడించారు. ఆ రైతులకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, వారికి రుణమాఫీ నిరాకరించారని ఆరోపించారు.

# సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చు

**హైదరాబాద్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):**విద్యావ్యవస్థ పటిష్టంగా ఉంటే సమాజంలో బలమైన మార్పు సాధ్యమవుతుందని నొక్కిచెప్పిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. ఆ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.గతంతో పోలిస్తే బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో పాటు విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయడంపై స్వయంగా ముఖ్యమంత్రే ఫోకస్ పెట్టారని తెలిపారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, ఇందుకోసం రూ.5 వేల కోట్లను కేటాయించనున్నట్లు తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి చీఫ్ గెస్టుగా హాజరైన డిప్యూటీ సీఎం ప్రసంగిస్తూ.. ఇందిరమ్మ రాజ్యానికి ఆయన ఆలోచనే స్ఫూర్తి అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాష్ట్రంలో నెలకొన్న ప్రజా ప్రభుత్వానికి ఆయన జీవితమే స్ఫూర్తి అని కొనియాడారు.ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అంబేద్కర్ నాలెడ్జి సెంటర్లను నిర్మిస్తామని, అందులో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. గత ప్రభుత్వంలో సర్కారు స్కూళ్ళు మూతబడితే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాల లేని గ్రామ పంచాయతీ ఉండొద్దన్న ఉద్దేశంతో కొత్తవాటిని తెరిపిస్తున్నట్లు గుర్తుచేశారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున సర్వాయి పాపన్న విగ్రహం ఉండాలన్న విజ్ఞప్తులు వచ్చాయని, దానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయడంతో పాటు విగ్రహాన్ని ఎక్కడ పెట్టాలి, స్థలాన్ని ఎలా సేకరించాలి తదితర అంశాలపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. దానిపై స్పష్టమైన నివేదికను ప్రభుత్వానికి ఇవ్వ గానే కార్యరూపం దాల్చేలా తాను చొరవ తీసుకుంటానని అన్నారు. ఇందిరమ్మ రాజ్యానికి పాపన్న జీవితమే ఆదర్శమని గుర్తుచేసిన డిప్యూటీ సీఎం.. రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం, ప్రజలు మెచ్చే పాలనను అందించడం, బడుగులకు అవకాశాలు ఇవ్వాలని ఆచరణ ద్వారా ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత సర్దార్ సర్వాయి పాపన్నకే దక్కుతుందన్నారు. ఆయన పుట్టిన ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి రూ.4.70 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. పాపన్న జీవిత చరిత్రపై రూపొందించిన పాకెట్ బుక్కును ప్రతి గ్రామానికి పంపాలని, విరివిగా ప్రజల వద్దకు తీసుకెళ్లాలని, ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని భరోసా ఇచ్చారు. ఒక కూలీగా జమిందార్ వద్దకు చేరి సహచరులందర్నీ యుద్ధానికి సిద్ధం చేశారని, ఈ సమాచారం లీక్ కావడంతో జమీందారు అందర్నీ బంధిస్తే ఇబ్బందులకు తలవంచకుండా స్నేహితులనే సైనికులుగా మార్చి జమీందారు కోటలను పాపన్న జయించారని గుర్తుచేశారు. వరంగల్ కోటనే కాక గోల్కొండ కోటనూ జయించారని, జమిందార్లతో పోరాటం ప్రాణానికే ప్రమాదమంటూ తల్లి వారించినా ప్రజల కోసం సిద్ధపడ్డారని తెలిపారు.హక్కులు, కోర్టులు, చట్టాలు లేని సమయంలోనే సర్వాయి పాపన్న ఎన్నో విజయాలు సాధించి స్ఫూర్తిగా నిలిచారని కీర్తించారు. సామాన్యులను కూడగట్టి సైనికులుగా తీర్చిదిద్దిన సర్దార్ పాపన్న... భారతదేశంలోనే బలమైన సైన్యం కలిగిన మొఘల్ చక్రవర్తులను ఓడించారని, సంకల్పబలం ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆచరణ ద్వారా నిరూపించారని గుర్తుచేశారు.



## హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

**హైదరాబాద్:ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో గత కొన్నిరోజులుగా తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాదు నగరాన్ని ఇవాళ కూడా వర్షం ముంచెత్తింది.నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తుండడంతో, పలు చోట్ల రోడ్లపైకి నీరు చేరింది. దాంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. వాహనదారులు అవస్తలు పడుతున్నారు. ఉప్పల్, హయత్ నగర్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, దిల్ సుఖ్ నగర్, తార్నాక, కోఠి, సోమాజిగూడ, నాంపల్లి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయం కావడంతో ఎల్బీనగర్-చాదర్ ఘాట్ మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



## అభిషేక్ మను సింఘ్వీ అభ్యర్థిత్వాన్ని ఆమోదించిన రాష్ట్ర కాంగ్రెస్

**హైదరాబాద్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** గచ్చిబౌలిలోని షెర్టాన్ హోటల్‌లో ఆదివారం సాయంత్రం సీఎల్పీ సమావేశం జరిగింది. తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని ఆమోదించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలుపుతూ సీఎల్పీ తీర్మానం చేసింది.సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, అభిషేక్ మను సింఘ్వీ ఎమ్మెల్యేలు, సీనియర్‌నేతలు హాజరయ్యారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాసరెడ్డి, కాలే యాదయ్య తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేయనున్నారు.



## పేద 'రాజు'లకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

సహకరి,చాలని పిలుపునిచ్చారు.హాలీవుడ్‌తో పోటీ పడగలిగిన బాహుబలి కూడా ఒక రాజేనని, తనకు మంచి మిత్రుడైన రాంగోపాల్ వర్మ కూడా బాలీవుడ్‌కు ఎదిగారని గుర్తుచేశారు. కృష్ణంరాజు గురించి మాట్లాడుకోకుండా సినీ రంగాన్ని చర్చించలేమని గుర్తుచేసిన సీఎం రేవంత్... సైద్ధాంతికంగా కొందరు రాజకీయ నాయకులతో విభేదాలున్నా వారు స్నేహితులేనని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రారంభించాలనుకుంటున్న నిజాం షుగర్ ప్యాక్టరీ ఇప్పుడు రాజుల చేతుల్లోనే ఉన్నదని, పన్నెండేళ్లుగా పరిష్కారం కానిది ఇప్పుడు కొలిక్కి వస్తున్నదని, వారి సహకారంతోనే తొందర్లో అది రీ-ఓపెన్ అవుతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న యంగ్ ఇండియా తెలంగాణ స్కిల్స్ యూనివర్శిటీకి కో-చైర్మన్‌గా శ్రీనివాసరాజునే నియమించామని గుర్తుచేశారు.కాంగ్రెస్ పార్టీలో సైతం రాజులకు తగిన ప్రయారిటీ ఉన్నదని, అందువల్లనే టికెట్ రాకపోయినా కర్ణాటకలో పార్టీని అధికారంలోకి తెచ్చిన బోసురాజు కృషిని గుర్తించి రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా ఆయనకు మంత్రి పదవి ఇప్పించారని సీఎం రేవంత్ గుర్తుచేశారు. తెలంగాణలో పదేండ్ల పాటు పార్టీ కష్టకాలంలో ఉన్నా తన శక్తిని ధారపోసి ఇప్పుడు పవర్‌లోకి వచ్చేలా చేయడంలో బోసురాజు కృషి ఉన్నదన్నారు. రానున్న రోజుల్లో నాగరాజు లాంటి వ్యక్తికి కార్పొరేటర్ పదవి ఇచ్చి ఆ తర్వాతి దశలో ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగు పెట్టేందుకు తాను చొరవ తీసుకుంటానని అన్నారు. ఇంకా ఎవరైనా రాజులకు రాజకీయాల్లో అవకాశాలు కావాలంటే తన దృష్టికి తేవచ్చన్నారు. ఇప్పుడు మన ముందు కేంద్ర మంత్రిగా ఉన్న భూపతిరాజు శ్రీనివాసవర్మకు పార్టీలో లాయల్టీ ఉన్నదని, నిబద్ధత ఉన్నదని కానీ డబ్బులు మాత్రం లేవని, అయినా కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కిందని, పార్టీ వేరైనా వెంటనే ఫోన్ చేసి అభినందించానని గుర్తుచేశారు.రాజుల్లో పేదలు కూడా ఉన్నారని, వారి వివరాలను ప్రభుత్వానికి అందిస్తే సంక్షే పథకాలను వారికి కూడా వర్తింపజేసేలా తాను చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. నిర్మాణ రంగంలో రాజులకు ఉన్న అనుభవాన్ని రంగరించి క్షత్రియ భవన్‌ను అద్భుతమైన కట్టడంగా మల్చాలని, ఆ భవన్‌లోనే మరోసాని మనం కలుసుకుందామని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కి కీలక బాధ్యతలు



**హైదరాబాద్: ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరంలోని రవీంద్రభారతిలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న జీవితం అందరికీ ఆదర్శం అని అన్నారు. భవిష్యత్ తరాలకు పాపన్న స్ఫూర్తి గాథలు తెలియాలని అభిప్రాయపడ్డారు. సర్వాయి పాపన్న స్వగ్రామాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని కీలక వ్యాఖ్యలు చేశారు.పర్యాటక కేంద్రం నిర్మాణానికి రూ.4.70 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. దీని బాధ్యత మంత్రి పొన్నం ప్రభాకర్ అని సూచించారు. ఇక అంతేకాదు.. సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర గురించి ప్రజలకు తెలిసేలా పాకెట్ పుస్తకాలను ముద్రిస్తామని కీలక ప్రకటన చేశారు. ఇందిరమ్మ రాజ్యానికి కూడా సర్వాయి పాపన్న ఆలోచనలే మార్గదర్శకం అని అన్నారు. సర్దార్ పాపన్న చరిత్ర చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. గోల్కొండను కూడా దాదాపు 6 సంవత్సరాల కాలం పాటు పాలించాడంటే చాలా గొప్ప వీరుడనే చెప్పాలి.

## తెలంగాణలో ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులు..!

**హైదరాబాద్: ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఆర్టీసి త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశ పెట్టనుంది. ఈ ఎలక్ట్రికల్ సూపర్ లగ్జరీ బస్సులను కరీంనగర్-హైదరాబాద్, నిజామాబాద్-హైదరాబాద్ మార్గాలలో నడపాలనీ ఆర్టీసీ నిర్ణయించింది.సూపర్ లగ్జరీ పేరుతో తీసుకు రానున్న ఈ బస్సులు ఇప్పటికే కరీంనగర్ డిపోకు 35, నిజామాబాద్ డిపోకు 13 చేరుకున్నాయి. ఈ బస్సులను ఆర్టీసీ ప్రయివేటు సంస్థ నుంచి అద్దెకు తీసుకుంది. అయితే ఇప్పటికే హైదరాబాద్ లో సిటీ బస్సులుగా, హైదరాబాద్- విజయవాడ మధ్య అంతరాష్ట్ర సర్వీసులుగా నడిపిస్తోంది. ఈయవన్నీ మెట్రో డీలక్స్ బస్సులు కాగా ప్రస్తుతం సూపర్ లగ్జరీ బస్సులను నడిపించనుంది.త్వరలోనే వీటిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులఎ ఎక్కువగా ఉండటంతో వీటి నిర్వహణకే అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అటు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొత్త బస్సులు కూడా కొనుగోలు చేయలేక పోతోంది. ఈ బస్సుల్లో డ్రైవర్లుగా బస్సు తయారీదారు సిబ్బందే ఉండగా, కండక్టర్లుగా మాత్రం ఆర్టీసీ సిబ్బంది ఉంటారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం..









**పరకాల, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో రూ.5కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు, రూ.11.74 కోట్లతో అమృత్ 2.0 పథకానికి సంబంధించిన పనుల ప్రారంభోత్సవానికి హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా పరకాలకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేరుకోగా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, తదితరులు పూల మొక్కలు, పుష్పగుచ్చాలను అందించి ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపాలిటీ ఆవరణలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం పరకాల మున్సిపాలిటీ కార్యాలయంలో పరకాల శాసనసభ నియోజకవర్గ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు.అనంతరం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. హైదరాబాద్ లో కూడా టెక్స్టైల్ పార్క్ తో పాటు అభివృద్ధి అంశాలపై సమీక్షించినట్లు చెప్పారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ తో ఈ ప్రాంత అభివృద్ధి రూపురేఖలు మారనున్నాయని అన్నారు. రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కొరియా పర్యటనకు వెళ్ళిన ముఖ్యమంత్రి టెక్స్టైల్ పార్క్ కు సంబంధించి పెద్ద కంపెనీలతో చర్చలు జరిపారని, ఆయా సంస్థల ప్రతినిధులు కొద్ది రోజుల్లో ఇక్కడ పర్యటించి టెక్స్టైల్ పార్కులో పరిశ్రమలు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఇది శుభవార్త అని అన్నారు. వరంగల్, హనుమకొండ మీదుగా వెళ్తున్న జాతీయ రహదారికి భూ సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం విలువైన భూములు అనేది వాస్తవమని, ప్రజలకు, రైతులకు ఎవరికి ఇబ్బంది లేకుండా పరిహారం అందిస్తామన్నారు. భూములు ఇస్తున్న రైతులకు మంచి పరిహారం అందిస్తుందని, ఈ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రజలకు రైతులకు అనుకూలంగా ఉండే విధంగా మంచి పరిహారం అందించాలని ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. హైవే కోసం భూములు ఇస్తున్న రైతులకు 40 శాతం వరకు పరిహారం అందించినట్లు పేర్కొన్నారు. మిగతా పరిహారాన్ని అందించేందుకు స్థానిక శాసనసభ్యులు, ఇతర ముఖ్య నాయకులతో కలిసి రాబోయే కొద్ది రోజుల్లో గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం కావాల్సిన మొత్తం ఏరియాను కేంద్ర ప్రభుత్వానికి, ఎన్.హెచ్ కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందజేయనున్నట్లు తెలిపారు. వాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తుందన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జల యజ్ఞం కార్యక్రమంలో భాగంగా కోనయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ కోసం సుమారుగా రూ. 41 కోట్లను మంజూరు చేశారని చెప్పారు. పనులను పూర్తి చేసేందుకు ఏజెన్సీని కూడా ఫైనల్ చేశారని అన్నారు. అప్పుడు ఒకపక్క గోదావరి పరివాహక ప్రాంతం, మరో పక్క కృష్ణా పరివాహక ప్రాంతంలోని రిడ్జ్ లో ఈ లిఫ్ట్ ఉంటుందని, కాకతీయ కెనాల్ మీద లిఫ్ట్ ఏర్పాటు చేయడం కోసం ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు. దానికి సంబంధించిన డ్రైన్ సరైన వెడల్పు, పొడవు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం రూ.4కోట్లతో పనులను సరైన విధంగా టెక్నికల్గా చేపట్టలేదన్నారు. భవిష్యత్తుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరైన విధంగా డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గ్రామాలకు పట్టణాలకు మంచినీరు అందించేందుకు అమృత్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించాల్సి ఉండగా ఆనాటి ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని అందిస్తామని అన్నారని తెలిపారు. ఇటీవల మిషన్ భగీరథ కు సంబంధించి సర్వే నిర్వహించగా 51శాతం మంచి నీరు రావడం లేదని ఆ సర్వేలో తేలిందన్నారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు, ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీటిని తమ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దీనిలో భాగంగానే 11 కోట్లకు పైగా నిధులతో పరకాలలో అమృత్ పథకానికి ప్రారంభోత్సవం చేసినట్లు తెలిపారు. అభివృద్ధిని సంక్షేమాన్ని సమతులంగా రాష్ట్రంలో చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మంజూరైన 11 కోట్ల రూపాయలతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, డ్రైనేజీ, తదితర అభివృద్ధి పనులను పూర్తిస్థాయి వివరాలతో కూడిన ప్రగతి నివేదికతో చేపడితే బాగుంటుందని అన్నారు. మెగా టెక్స్టైల్ పార్క్ కోసం భూముల కోల్పోయిన రైతులకు ఇండ్లను కేటా స్తామని ముఖ్యమంత్రి ప్రకటించా రని వెంటనే వారి పేర్ల జాబితాను అధికారులు రూపొందించి ఇవ్వాలన్నారు. సెప్టెంబర్ మూడో వారంలో మెగా జాబ్ మేళాను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. మెగా జాబ్ మేళా తో టెక్స్టైల్ పార్క్ లో ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై ఇంచార్జ్ మంత్రిగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు ప్రత్యేక దృష్టిని పెట్టారని అన్నారు. ఉమ్మడి జిల్లాను మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ నేషనల్ హైవే కోసం పరకాల నియోజకవర్గ పరిధిలో భూ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. భూములు ఇచ్చిన ఆయా గ్రామాల రైతులకు పరిహారం అందించినట్లు తెలిపారు. మిగతా రైతులకు పరిహారం అందించనున్నట్లు పేర్కొన్నారు. పరిహారం విషయంలో ఆయా గ్రామాల రైతులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా వరద ముంపు ప్రభావం తప్పేవిధంగా పరకాలలో నాలా విస్తరణ పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పరకాల నియోజకవర్గం పరిధిలో కోనాయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, నేషనల్ హై వే ఉన్నాయన్నారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ కు సంబంధించి ఐదు కంపెనీలతో ఎం ఓ యు లు అయ్యాయని పేర్కొన్నారు. 52 కంపెనీలతో ఒప్పందాలు కానున్నాయని తెలిపారు. పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ అనిత, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పరకాల ఆర్డీవో డాక్టర్ కె. నారాయణ, మున్సిపాలిటీ కమిషనర్ నరసింహ, తహసిల్దార్లు, ఇతర శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్కాం

**• ఇరుకున పడ్డ సిఎం సిద్ధరామయ్య ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆమోదం**

**బెంగళూరు,ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్కాం కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరా మయ్య ప్రస్తుతం ఇబ్బందుల్లో పడ్డారు.ఆయనను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పుడు ఆయనపై కేసు నమోదు చేయనున్నారు.ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే భూ కేటాయింపుల్లో సీఎం సిద్ధరామయ్య అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. అంతేకాదు ఈ కేసులో గవర్నర్ ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరా మయ్యకు షోకాజ్ నోటీసు పంపించారు. సిద్ధరామయ్యపై ఆర్‌టీఐ కార్యకర్త టీజే అబ్రహం కేసు దాఖలు చేశారు. అవినీతి నిరోధక చట్టం కింద సీఎంపై విచారణకు అనుమతి ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఆ క్రమంలో సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వాలని కోరారు.ఆయన ఆమోదం లేకుండా సీఎంపై కేసు పెట్టలేమని అందుకే అవినీతి నిరోధక చట్టం కింద సీఎంపై కేసు నమోదు చేయాలని అబ్రహం గవర్నర్‌ను డిమాండ్ చేశారు. సిద్ధరామయ్య, ఆయన భార్య, కుమారుడు, ముడా కమిషనర్‌పై కూడా కేసు నమోదు చేయాలని అబ్రహం తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముడా కుంభకోణంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కుంభకోణంలో సిద్ధరా మయ్య దంపతులు లబ్ది పొందారని తెలుస్తోంది. 2021లో ముడా అభివృద్ధి కోసం మైసూరులోని కేసరే గ్రామంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతి నుంచి 3 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. ప్రతిఫలంగా ఆమెకు దక్షిణ మైసూర్‌లోని విజయనగర్‌లో భూమిని కేటాయించారు. విజయనగరంలో భూమి ధర కేసరెలో భూమి కంటే చాలా ఎక్కువ కావడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.దీంతో ముడా ద్వారా ఈ భూముల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాదు 2023 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో తన భార్య యాజమాన్యాన్ని వెల్లడించడంలో సిద్ధరామయ్య విఫలమయ్యారని ఆర్టీఐ కార్యకర్త అబ్రహం తన ఫిర్యాదులో ఆరోపించారు. వాస్తవానికి ఓఆం కర్ణాటక రాష్ట్ర స్థాయి అభివృద్ధి సంస్థ. పట్టణాభివృద్ధిని ప్రోత్సహించడమే ఈ ఏజెన్సీ పని. దీంతో పాటు ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లను అందించాలి. కానీ సీఎం భార్యకు ఎక్కువ ధర ఉన్న భూమిని అప్పగించడంపై బీజేపీతోపాటు పలువురు నేతలు ప్రశ్నిస్తున్నారు.



## డబ్బుతో గాలం..! భాజపాపై హేమంత్ ధ్వజం



**రాంచీ,ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఝూర?ండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయీ సోరెన్ భాజపాలో చేరతారంటూ ఊహాగానాలు వస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామాలు జరగడం గమనార్హం.ఈ క్రమంలోనే జేఎంఎం నేత, సీఎం హేమంత్ సోరెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజల్లో చీలిక తెచ్చేందుకు భాజపా యత్నిస్తోందని, డబ్బుతో ఎమ్మెల్యేలకు గాలం వేసేందుకూ ఆ పార్టీ వెనుకాడబోదని ఆరోపించారు."ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీల్లో విషాన్ని వ్యాప్తి చేసి.. వారు పరస్పరం పోట్లాడుకునేలా.. అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్‌ల నుంచి కొంతమందిని భాజపా ఇక్కడ దించింది. సమాజంలో విభజనలు తేవడమే కాదు.. కుటుంబాలు, పార్టీలనూ విచ్ఛిన్నం చేసే పనిలో పడింది. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ఆ పార్టీకి అలవాటే. డబ్బు విషయమే వస్తే.. రాజకీయ నాయకులు పార్టీలు మారేందుకు ఎక్కువ సమయం పట్టదు" అని గోడ్డా జిల్లాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సీఎం హేమంత్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రతిపక్ష పార్టీ నిర్ణయిస్తుందని, ఎన్నికల సంఘం కాదని విమర్శించారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో భాజపా తుడిచిపెట్టుకుపోతుందన్నారు.మరోవైపు.. తనకు జేఎంఎంలో అవమానాలు జరిగాయంటూ చంపయీ సోరెన్ ఇప్పటికే ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నందునే ప్రత్యామ్నాయం కోసం చూడాల్సి వచ్చిందన్నారు. అయితే, భాజపాలో చేరికపై స్పష్టత ఇవ్వలేదు.

## రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ నేతలే అంటున్నారు : మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్: ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):**'మీ పార్టీ ప్రజా ప్రతినిధులే రుణమాఫీ కాలేదు అంటున్నారు. ఇప్పుడు ఎవరు రాజీనామా చేయాలో... ఎవరు ఏటిలో దూకి చావాలో... ఎవరికి చీము నెత్తురు లేదో...ఎవరు అమర వీరుల స్థూపం దగ్గర ముక్కు నేలకు రాయాలో... ఎవరు రాజీనామా చేయాలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని' అని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం ట్విట్టర్ వేదికగా సీఎంపై ఫైర్ అయ్యారు. కోదండ రెడ్డి, కోదండరాం రెడ్డి, ఆది శ్రీనివాస్ ముగ్గురు ఒప్పుకుంటున్నది రుణమాఫీ సంపూర్ణంగా కాలేదని.తాను అదే చెప్పానని, రాష్ట్రంలో పాక్షికంగా మాత్రమే రుణమాఫీ జరిగింది అని అన్నారు. 31 వేల కోట్లు అని చెప్పి 17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని తానంటే ఎందుకు రంకెలేస్తున్నారని నిలదీశారు. రుణమాఫీ పూర్తయి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎందుకు నిరసనలు తెలుపుతున్నారని, ఎందుకు సీఎం, ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతీ అంశాన్ని రాజకీయ కోణంలో చూడటం, తొండి చేసైనా తామే గెలిచినం అనే వైఖరి ప్రదర్శించడం అవివేకం అవుతుందన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి, రుణమాఫీ ప్రక్రియను తూతూ మంత్రంగా కాకుండా సమగ్రంగా పూర్తి చేయాలని, రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు.

## జూనియర్ డాక్టర్ మౌమితా దేబ్‌నాథ్‌పై జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా..

- భాద్యులకు కఠిన చర్యలు తీసుకోవాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ ప్రతినిధి: ఆగస్టు 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** కోల్‌కతాలోని ఆర్‌జి కర్ హాస్పిటల్‌లో పిజిటి డాక్టర్ మౌమితా దేబ్‌నాథ్ దారుణ హత్య, అత్యాచారం వెనుక ఉన్న నేరస్థుడిని శిక్షించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దోషులకు ఉరిశిక్ష విధించాలని అన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించే గౌరవ ప్రదమైన వైద్య వృత్తిలో కొనసాగుతున్న మౌమితాదేబ్‌నాథ్ కి ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే వాపోయారు. దేశంలో ప్రతి మహిళకు అన్ని విధాలుగా రక్షణ చర్యలకోసం ప్రభుత్వాలు మరింత కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు. మౌమిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు.

## యువత భవిష్యత్తులో అభ్యున్నతి సాధించాలంటే మత్తు పదార్థాలకు దూరంగా వుండాలి..



**హనుమకొండ ప్రతినిధి: ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** యువత రాబోవు రోజుల్లో మరింత అభ్యున్నతి సాధించాలనుకుంటే మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ యువత సూచించారు. యువతను మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా మత్తు పదార్థాల నిర్మూలణ కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా వరంగల్ కమిషనరేట్ పోలీసుల అధ్వర్యంలో యువతకు 4కె పరుగును నిర్వహించడం జరిగింది. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని కళాశాలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు స్థానిక యువతి, యువకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్‌తో పాటు, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డా. సత్య శారద, ప్రావీణ్య, ఎన్‌పిడిసిఎల్ చైర్మన్ వరుణ్ రెడ్డితో పాటు జబర్దస్త్ ఫేం అదిరే అభి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ముందుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న విధ్యార్థులు, ముఖ్య అతిథుల చేత మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసారు. అనంతరం వరంగల్ పోలీస్ పరేడ్ నుండి ప్రారంభమైన 4కె పరుగును ముఖ్య అతిధులు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుండి ప్రారంభమైన ఈ పరుగును అదాలత్ సెంటర్ వరకు తిరిగి అక్కడి నుండి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ వరకు కొనసాగింది. చివరగా ఈ పరుగులో యువతి, యువకుల విభాగాల్లో మొదటగా వచ్చిన ముగ్గురికి ముఖ్య అతిధుల చేతుల మీదుగా నగదు పురస్కారాలను అందజేయడం జరిగింది. ఈ పరుగులో పాల్గొన్న విద్యార్థులు, యువతియువకులను ఉద్యేశిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలపై వ్యతిరేకంగా యువత ముందుకు సాగాలనే లక్ష్యంతో ఈ పరుగును ఏర్పాటు చేయడం జరిగిందని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలు దూరంగా వుండాలని, మత్తు పదార్థాలు వినియోగించిన, విక్రయించిన నేర మవుతుందని, ఇలాంటి చర్యలకు పాల్పడేవారి సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై వుందని, డ్రగ్స్ ఫ్రీ కమిషనరేట్ మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుయితే మత్తు పదార్థాలకు దూరం వుండాలని, మీ భవిష్యత్తు కోసం నిత్యం శ్రమించే మీ కుటుంబ సభ్యులను దృష్టిలో వుంచుకోని మత్తుకు పదార్థాలకు బానిసలు కావద్దని తెలిపారు. మత్తు పదార్థాలను సేవించే వారిని తక్కువ చేసి చూడకుండా వారిని చేరదీసి మత్తు పదార్థాలక నుండి దూరం చేసేందుకు మనమందరం ప్రయత్నించాలని హనుమకొండ కలెక్టర్ తెలిపారు. ఎన్‌పిడిసిఎల్ చైర్మన్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి మీ భవిష్యత్తును నాశనం చేసుకోద్దని తెలిపారు. ఈ కార్యక్రమములో డిసిపిలు రవీందర్, రాజ మహేంద్రనాయక్,అదనపు డిసిపిలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐ, ఆర్.ఎస్.ఐలు, పోలీస్ జాగృతి కళాబృందంతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బహుజనులంతా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి..

- రాజస్థాపనే లక్ష్యంగా బహుజనులు ఉద్యమించాలి
- సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవ కమిటీ, రాష్ట్ర కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**హనుమకొండ ప్రతినిధి: ఆగస్టు 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా ముచ్చర్ల గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి కార్యక్రమము ముచ్చర్ల గ్రామ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కమటి కన్వీనర్ చిర్ర సుమన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పాల్గొని సర్దాయి పాపన్న గౌడ్ విగ్రహనికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. ఢిల్లీ పీఠానికి గడగడలాడించిన తెలుగు తేజం, గోల్కొండ కోటపై మొగులాయిల పెత్తనాన్ని దిక్కరించిన దిశాలి, ఔరంగజేబుకి ముచ్చెముటలు పట్టించిన బహుజన పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. సమ సమాజ స్థాపన కోసం ప్రాణాలను పణంగా పెట్టిన మహా వీరుడని, పేదల పాలిట ఆపద్బాంధవుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. గోల్కొండ ఖిల్లాపై విజయకేతనం ఎగరవేయడమే లక్ష్యంగా తుదివరకు పోరాడిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, జనహృదయంలో అత్తనొక సర్దార్. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వరంగల్ జిల్లా ఖిలాషాపురం గ్రామంలో ఒక సామాన్య గీత కార్మికుల కుటుంబంలో జన్మించి, బహుజన కులాల అందరితో సన్నిహితంగా ఉండేవాడు. చాకలి సర్వన్న, మంగల మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాళు ళ్ళ, దూదేకుల పీరు, కొత్వాల్ మీరు సాహెబ్ వీరంతా ఆయన ప్రధాన అనుచరులు. 12 మందితో మొదలైన ఆ పోరాటం 12 వేల సైన్యంగా అవతరించింది. అమ్మ తాటి చెట్టు ఎక్కను, లొట్టి పట్టను గోల్కొండ పాలన పగ్గాలు పట్టడమే నా జీవిత ఆశయం అని తల్లికి ఇచ్చిన మాట ప్రకారం, గోల్కొండ కోటపై దండయాత్ర చేసి గోల్కొండ కోటను ఏడు గడియలు పాలించిన గొప్ప వీరుడు సర్వాయి పాపన్న గౌడ్. ఇలాంటి బహుజన ఉద్యమనాయకుడు ఐన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను, ఈ తరం బహుజనులంతా ఆదర్శంగా తీసుకొని రాబోయే రోజుల్లో బహుజన రాజ్యస్థాపన లక్ష్యంగా ఉద్యమించాలని వడ్లకోండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం, బహుజన నాయకులు, పెరుమాండ్ల అనిల్, చల్ల వెంకటేశ్వర్లు, చిర్ర సత్యం, అరెల్లి సతీష్, చిర్ర శ్రావణ్, చిర్ర రాజేష్, శనిగరపు సుమన్, గుర్రం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలి

- జిల్లా కలెక్టర్ డా సత్య శారద



**వరంగల్ ప్రతినిధి: ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ డా సత్య శారద అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం లో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ డా సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యా రాణి పాల్గొని శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని అన్నారు. శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితము అందరికీ ఆదర్శమని, వారి ఆశయాలను కొనసాగించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ మరియు నర్సంపేట ఆర్డిఓ కృష్ణవేణి, వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిని ఎ.పుష్పలత, గౌడ సంఘ నాయకులు బోనగాని యాదగిరి గౌడ్, చిర్ర రాజు గౌడ్, డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ గౌడ్, గట్టు రమేష్ గౌడ్, కోలా రాజేష్ కుమార్ గౌడ్,అనంతల రమేష్ గౌడు, సుధాకర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐనవోలులో మృతుల కుటుంబాలను పరామర్శించిన చైర్మన్ మార్నేని




**హనుమకొండ ప్రతినిధి: ఆగస్టు 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఐనవోలు మండలం ఒంటి మామిడి పల్లి గ్రామానికి చెందిన మజ్జిగ వెంకట నారాయణ, మజ్జిగ రంజిత్ శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.., ఈ విషయం తెలుసుకొని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు ఆదివారం వారి పార్థివ దేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్ష ఎన్నికలు..

- ఓటు హక్కును వినియోగించుకున్న పద్మశాలి కులస్తులు






**పరకాల, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఒక కులానికి సంబంధించిన ఎన్నిక భారత దేశ చరిత్రలో తోలి సారిగా రాజ్యాంగ బద్దంగా ప్రజాస్వామ్యంగా గ్రామానికి నాలుగు చొప్పున పద్మశాలి కులస్తుల ఓట్లు ద్వారా తెలంగాణ రాష్ట్రం మొత్తంలో యాబై వేల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పరకాల మండల పద్మశాలి సేవ సంఘం అధ్యక్షులు దాసరి బిక్షపతి తెలిపారు. ఆదివారం జరిగిన రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్ష ఎన్నికల్లో పరకాల, నడికూడ, శాయంపేట మండలాలకు గాను శాయంపేట చేనేత సంఘంలో పోలింగ్ బూత్ ఎర్పాటు చేసినారు. ఓటు వినియోగించుకున్న వారిలో పరకాల మండల పద్మశాలి సేవ సంఘం అధ్యక్షుడలు దాసరి బిక్షపతి, మోతె రఘుపతి, వావిలాల రాజు సమ్మయ్య, మంతెన సంతోష్,పెగడ సమ్మయ్య, గుండా సత్యనారాయణ, బంక రవిందర్, ఐతే సాంబయ్య తదితరులు అధిక సంఖ్యలో పద్మశాలి సోదరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## వరంగల్ ఎంపీ డా.కడియం కావ్యను అభిషేక్ మను సింఘ్వికి పరిచయం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నానక్ రామ్‌గూడలోని హొటల్ షెరటాన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. సమావేశం అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఎంపీ డా. కడియం కావ్య ని అభిషేక్ మను సింఘ్వికి పరిచయం చేశారు. తెలంగాణ నుంచి రాజ్యసభ ఉప ఎన్నికల్లో పోటీ చేయనున్న అభిషేక్ మను సింఘ్వి కి ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



# బిసిల రాజ్యాధికార దిశగా అందరూ పాటుపడాలి..

- గోదావరిఖని బార్‌లో సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

**హనుమకొండ ప్రతినిధి: ఆగస్టు 18 (పీసీ డబ్ల్యూ న్యూస్):** ఐ ఎల్ పి ఎ కార్యదర్శి ఎన్ జె శ్యాంసన్ జనాభాలో 60 శాతంగా ఉన్న బి.సి లు రాజ్యాధికారం దిశగా ప్రయాణం చేయాలని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ ఎల్ పి ఎ) తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎన్ జె శ్యాంసన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆవరణ లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో అత్యధిక జనాభా బి సి. లది అయినప్పటికీ అధికారం అగ్ర వర్ణాల చేతుల్లో కీలు బొమ్మగా మారిందన్నారు. బి సి లంతా ఐక్యమైతే రాజ్యాధికారంతో పాటు మన హక్కులను మనమే సాదించు కోవచ్చున్నారు. స్వాతంత్రం సిద్ధించిన నాటి నుంచి బి.సి లను అన్ని వర్గాలు వాడుకొని వొదిలేస్తున్నారన్నారు. బి.సి




న్యాయవాదులను చైతన్యం చేసి తద్వారా బి.సి సమాజాన్ని ఐక్యం చేసేందుకు ఐ ఎల్ పి ఏ ఆద్వర్యంలో ఈ నెల 25 న హైదరాబాద్ లోని మాసాబ్ ట్యాంక్ జె ఎన్ టి యు ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించే ఓబిసి న్యాయవాదుల సదస్సును విజయవంతం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐ ఎల్ పి ఏ నాయకులు సాయిని నరేందర్, జూకూరి మహేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, ఉపాధ్యక్షులు రామటెంకి శ్రీనివాస్, బీసీ న్యాయవాదులు వేల్పుల మురళీధర్ యాదవ్, పుర్మా శ్రీనివాస్, ముచ్చకుర్తి కుమార్, రాగం శ్రీధర్, గుర్రాల రాజేందర్, సీతాకారి చంద్ర శేఖర్, వేల్పుల అరుణ్, ముష్కే రవి, సిరిమల్లా అనిల్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సదస్సు పోస్టర్ ను ఆవిష్కరించారు.




# కరీంనగర్ పట్టణంలో 21న ఉద్యోగ మేళా....

**కరీంనగర్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నిరోధ్యోగ యువతకు వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలకొరకు ఈ నెల 21,బుధవారము నాడు ఉద్యోగమేలను నిహించినట్టు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి తిరుపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. సేల్స్ ఆఫీసర్లు ,సీనియర్ సేల్స్ ఆఫీసర్ల కొరకు ఇంటర్,డిగ్రీ,ఆపై చదివి వుండాలి, వయసు 18 నుండి 36,సం" లోపు కలిగి వుండాలి అని సూచించారు.

# కరీంనగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి



**కరీంనగర్ టౌన్, ఆగస్ట్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను కరీంనగర్ లో ఘనంగా నిర్వహించారు, పట్టణ శివారు రేకుర్తి చౌరస్తాలో ఆయన విగ్రహానికి నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, బల్దియా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పూలమాలవేసి నివాళులర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న దేశం కోసం పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేటర్లు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# బదిలీ పై వెళుతున్న మిషన్ భగీరథ గ్రిడ్ ఎఇఇని సత్కరించిన యువకులు



**కరీంనగర్ టౌన్, ఆగస్ట్ 18 ( పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం మిషన్ భగీరథ గ్రిడ్ ఎ.ఇ.ఇ.గా 2016 నుండి 2024 వరకు విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న శ్రీ బీరం అజయ్ రెడ్డికి వీడ్కోలు సన్మానము కార్యక్రమాన్ని నిర్వహించి పూల దండలు శాలువాలతో సత్కరించిన స్థానిక అధికారులు, యువకులు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా సక్రమంగ విధులు నిర్వర్తించి అందరి ప్రశంసలను అందుకోవడం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# రెండవ వారం జ్ఞానమాల కార్యక్రమం

**జవహర్ నగర్, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాజీ నగర్ చౌరస్తాలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కి రెండవ వారం జ్ఞానమాల కార్యక్రమం జ్ఞానమాల నిర్వాహకులు మహంకాళి బిక్షపతి ఆధ్వర్యంలో కొనసాగించడం జరిగింది జ్ఞానమాల ఉద్దేశం జ్ఞానాన్ని బోధించడం మహనీయులను స్మరించుకుంటూ భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొనే విధంగా తరగతి గదులలో కూడా బోధించేందుకు మరో ఉద్యమంలా కృషి చేయాలని అన్నారు, అంతేకాకుండా మహనీయుల చరిత్రను కూడా ప్రతివారం బోధించేందుకు మరికొందరి వక్తల స్ఫూర్తితో జ్ఞానమాల కార్యక్రమం ముందుకెళ్తుందని తెలియజేశారు. కోయడ వెంకటేష్, దక్షిణాది భారత రాజకీయ సమాఖ్య జాతీయ అధ్యక్షులు, రసీద్ ద్రవిడ, ప్రగతిశీల మహిళా పెరిక సునీత, బహుజన కళాకారుడు, గడ్డం గిరి, అడ్వకేట్ బోలో పెల్లి కృష్ణ, మీడియా మిత్రులు, అంబాల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శం ....!

**● సర్దార్ జయంతి వేడుకల్లో గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్....**



**సీరోలు, 18(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలం కొత్తూరు (సి) గ్రామం లో గ్రామ గౌడ సంఘం నాయకులు బోమ్మగాని మల్సూరు గౌడ్ అధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 350 ఏళ్ల క్రితం ఆనాటి మొగల్ పాలకుల దౌర్జన్యాలకు , నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మరాఠయోధుడు చత్రపతి శివాజీ సమకాలికులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలుగు గడ్డపై తిరుగుబాటు చేసి 33 కోటలను జయించి స్వతంత్ర రాజ్యాలను ఏర్పాటు చేసి గోల్కొండ కోటను అరు నెలల పాటు పాలించిన గొప్ప బహుజన వీరులు అని అయన కొనియాడారు.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని అన్యాయాలు.అక్రమాలను ఎదురించాలని తెలిపారు.. ఆయన జీవితం అందరికీ స్ఫూర్తి దాయకమని అన్నారు.ఈ కార్యక్రమం అనంతరం కోత్తూరు (సి) గ్రామానికి చెందిన పలువురు పేద.బడుగు.బలహీన వర్గాలకు సహాయం చేసిన గుగులోతు కిషన్ నాయక్ ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ యానాల గంగాధర్ రెడ్డి.నాయకులు మలిశెట్టి వేణు.పగడాల క్రిష్ణా రెడ్డి.వీరన్న.గ్రామ గౌడ నాయకులు కోంపెల్లి రాములు.తండ సీతరాములు. కోంపెల్లి మల్లయ్య.తండ బాబు గౌడ్.మద్దెల నరేష్.దయ్యాల వెంకటేష్.గుదె శ్రీకాంత్ . గ్రామ గౌడ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టు విక్రమార్కని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్



**హైదరాబాద్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** నేడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ శాసనసభ్యులు కోడూరు సత్యనారాయణ గౌడ్ని కన్వీనర్గా నియమించడం జరిగింది, ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో పలువురు గౌడ సోదరులతో కలిసి కోడూరు సత్యనారాయణ గౌడ్ శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఎమ్మెల్సీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు గౌడ ప్రజాప్రతినిధులు నాయకులు హాజరైనారు.

# మరకలను కాదు..మెరుపులను చూడాలి

**● కవుల లోపాలను తూచకూడదు: డా.కాంచనపల్లి గోవర్ధన్ రాజు...**

**కరీంనగర్, ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కవుల పుస్తకాలకు రాసే ముందుమాటలు కవులను ప్రోత్సహించేలా ఉండాలని,కవుల లోపాలను తూచకూడదని,సినారె చెప్పినట్లు మరకలను కాదు మెరుపులను చూడాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు అన్నారు.కరీంనగర్ కు చెందిన కవి రచయిత విమర్శకులు వైరాగ్యం ప్రభాకర్ రాసిన భూమిక ఆధునిక సాహిత్య విమర్శ వ్యాస సంపుటిని స్థానిక వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జరిగిన పుస్తకావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిలోని గొప్పదనాన్ని, సహృదయతను ప్రదర్శించేలా మనోరంజకమైన వర్ణనలతో వ్యాసాలున్నాయని అన్నారు.తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు సి.వి.కుమార్ అధ్యక్షతన భవానీ సాహిత్య వేదిక సంస్థ తరపున జరిగిన సభకు విశిష్ట అతిథిగా హాజరైన కవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లక్సెట్టిపేట్ తన్నీరు సురేష్ మాట్లాడుతూ ముందు మాటలు ప్రేరణ కలిగించేవిగా,పాఠకులను పుస్తక పఠనం వైపు మరల్చేవిగా ఉండాలని అన్నారు.ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రముఖ కథా రచయిత పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కార గ్రహీత బి.వి.యన్.స్వామి మాట్లాడుతూ ముందు మాటలు, సమీక్షలు కవిని ప్రోత్సహించేలా, ఆప్తవాక్యంలా ఉండాలని అన్నారు.ప్రధాన వక్తగా హాజరైన ప్రముఖ కవి , ఉపాధ్యాయులు లేదాళ్ళ రాజేశ్వర రావు పుస్తకాన్ని పరిచయం చేయగా వర్ధమాన కవి తడిగొప్పుల కుమారస్వామి ఆహ్వానం పలికారు.కార్యక్రమంలో కవి, గాయకులు చిలుక రాజలింగం, బొమ్మకంటి కిషన్,గంప ఉమాపతి, సంకెపల్లి నాగేంద్రశర్మ, విలాసాగరం రవీందర్,కొత్త అనిల్ కుమార్, కట్ట శ్యామ్,జనగాని యుగంధర్,మఠం సాంబమూర్తి,నడిమెట్ల రామయ్య, పాక రాంమోహన్,కాడె శంకరయ్య, వెల్ముల జయపాల్ రెడ్డి,నలుమాసు విజయ ప్రసాద్,కోరుకంటి శశికి రణ్మయి, విజయశ్రీ,కసిరెడ్డి జలంధర్ రెడ్డి, సింగిరెడ్డి రాజిరెడ్డి ,రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.




# కోతుల బీభత్సానికి వృద్ధిరాలకి తీవ్ర గాయాలు



**సీరోల్, 18(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలోని కాంపెల్లి గ్రామానికి చెందిన గండి కౌసల్య 65 సం" కోతుల బీభత్సానికి కాళ్లు చేతులను తీవ్ర గాయాలు చేయడంతో ఆపేద వృద్ధురాలని గోస చూడలేక అక్కడవున్న గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులు ఆమెని మహబూబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది.ఎమర్జెన్సీలో వృద్ధురాలకి అత్యవసర చికిత్స డాక్టర్లు అందించడం జరుగుతుంది.డోర్నకల్ నియోజకవర్గంలోని కోతులు మరియు కుక్కలు వీరావీహారం చేస్తున్నాయి ప్రజలు మండిపడుతున్నారు.వీటినుంచి రక్షించే నాధుడు లేడా మహాప్రభువు అంటూ ముసలి వారు చిన్నపిల్లలు వేడుకుంటున్నారు.స్కూల్ కి వెళ్లే విద్యార్థులు,వృద్ధులు ప్రతి ఒక్కరిని చీల్చి చెండాడుతున్నాయి,అని మా గోడు ఎవరికి పట్టదా అంటూ మొరపెట్టుకుంటున్నారు. ఇంతగానం వీటి నుండి హాని జరుగుతుందని ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల అంతర్యం ఏమిటని చర్చించుకుంటున్నారు. చీమకుట్టిన వెంటనే చీమను చంపుతాం.అలాంటిది ప్రభుత్వానికి ఇంత జరుగుతున్న చీమకుట్టిన స్పర్శ కూడా లేకపోవడం ఏమిటని ప్రజలు అనుకుంటున్నారు.ప్రజా ప్రభుత్వంలోనే ప్రజల ఇంత ఇబ్బందులు ఉన్న ప్రజలను పట్టించుకోవడం ప్రజల గోస ఎందుకు అర్థం కావట్లేదని డోర్నకల్ ప్రజలు బహుమాటంగానే అనుకుంటున్నారు.వెంటనే ప్రభుత్వ వీటిపై సరైన నిర్ణయం తీసుకొని వెంటనే పరిష్కారం చూపాలని డోర్నకల్ ప్రజలు కోరుకుంటున్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితోనే సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం,4.70 కోట్ల అభివృద్ధి నిధులు...






**కరీంనగర్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** నేడు బహుజన బిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని గతంలో సైదాపూర్ మండల పర్యటనలో భాగంగా పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీ మేరకు నేడు సర్వాయిపేట గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుతో పాటు నాలుగు కోట్ల 70 లక్షల రూపాయలతో ఆ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు హుస్నాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి మేరకు టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిధులు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మరియు గౌడ సోదరుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంబరాలు నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా ప్రయాణికులకు ఆటో కార్మికులకు మిఠాయిలు పంచి ఆనందాన్ని పంచుకోవడం జరిగింది.అనంతరం కార్యక్రమాన్ని నిర్దేశించి జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ ఇచ్చిన మాట కట్టుబడి ఉండే నైజం గల బీసీ బిడ్డ పొన్నం ప్రభాకర్ కృషి వల్ల నేడు సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట గ్రామం నాలుగు కోట్ల 70 లక్షల రూపాయల నిధులతో పర్యటకంగా అభివృద్ధి చెందని ఇది ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో రాష్ట్రంలో హుస్నాబాద్ నియోజకవర్గ పర్యాటకంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో మొదటి దశలో ఉంటుందని సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నామని పర్యాటక అభివృద్ధి కోసం నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృషి చేసిన పొన్నం ప్రభాకర్కు కాంగ్రెస్ పార్టీ పక్షాన గౌడ సోదరుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్, నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి బాబు, చొప్పదండి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముద్దం తిరుపతి, కాంగ్రెస్ నాయకులు పొన్నం శ్రీనివాస్ గౌడ్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెన్న రాజమల్లయ్య, ఎస్ ఎల్ గౌడ్, రామిడి రాజిరెడ్డి, వంగల విద్యాసాగర్, నూనె గోపాల్ రెడ్డి, మాచర్ల అంజయ్య గౌడ్, కలర్ సత్తన్న, కోరుకంటి ఆనంద్, దూలం అంజయ్య గౌడ్, రాజ్ కుమార్ సిరికొండ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పివీ ప్రభాకర్ రావు జన్మదిన వేడుకలు...

**హైదరాబాద్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్మికుంట తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ ఛాంబర్ చైర్మన్ పివి ప్రభాకర్ రావు జన్మదినం సందర్భంగా కరీంనగర్ జిల్లా హుజురాబాద్ తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ హుజురాబాద్ నియోజకవర్గం అధ్యక్షులు నీల నాగరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులందరితో కలిసి హైదరాబాద్ లో పివీ ప్రభాకర్ రావు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.అనంతరం జమ్మికుంట లో అనాథ వృద్ధులకు పండ్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు నీల నాగరాజు మాట్లాడుతూ.. మాజీ ప్రధాని భారతరత్న పివి నరసింహారావు కుమారుడు పివీ ప్రభాకర్ రావు పేద ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తి అని అలాగే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి,కి సమస్యలు వివరించడంలో తన పాత్ర చాలా ఉందని అన్నారు, రానున్న కాలంలో తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ను రాష్ట్రవ్యాప్తంగా ఒక ఉన్నత స్థాయికి తీసుకురావడానికి సర్వశక్తుల స్వయంకృషితో పోరాడతామని జర్నలిస్ట్ అంటే ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి జర్నలిస్ట్ అని అధికారులకు ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే వ్యక్తి అని జర్నలిజానికి తగిన న్యాయం చేసి రాష్ట్ర అభ్యున్నతికి మావంతు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నేదురు సమ్మయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షులు మద్దెర్ల కుమారస్వామి, అక్క పెల్లి నవీన్ కుమార్, కనవేని సతీష్ కుమార్, బడుగు రవి, మోర ప్రశాంత్, ముజీబ్, మోహిన్, రసమల్ల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



# నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

**● రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీలో 4 అవార్డులు, జిల్లాస్థాయి ఫోటోగ్రఫీలు 5 అవార్డులు అందుకున్న ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ టియుఎన్ స్వామి ● ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,( మంచిర్యాల, దేవాపూర్). ప్రాంతాలకు 1999 నుండి 2005 వరకు వరుసగా అవార్డులు అందుకున్న మనోహర స్వామి**















**హైదరాబాద్ సీఈఓ, ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాసిపేట మండలానికి చెందిన దేవపూర్ గ్రామం ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ మనోహర స్వామి రాష్ట్రస్థాయిలో మరియు జిల్లాస్థాయిలో అనేక బహుమతులు అందుకున్న సందర్భంగా ఫోటోగ్రాఫర్ మనోహర్ స్వామిని పి సి డబ్ల్యూ సీఈవో పాషా పలకరించగా వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాను ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూర్ మండలంలోని గుర్తురు గ్రామానికి చెందిన వాడినని బాల్యంలోనే ఫోటోగ్రఫీ అంటే ఇష్టమని తన స్వగ్రామంలోనే 1974 సంవత్సరం 9వ తరగతి చదువుకున్న సమయంలో ఫోటోగ్రఫీ పై మక్కువ పెరిగి తొర్రూర్ లో ఉన్న శ్రీకృష్ణ ఫోటో స్టూడియోలో ఫోటోగ్రఫీ నేర్చుకున్నానని తన గ్రామం నుండి పది కిలోమీటర్ల దూరం అయినప్పటికీ సైకిల్ పై వెళ్లి నేర్చుకోవడం జరిగిందని పేర్కొన్నారు. 1978 సంవత్సరంలో క్లిక్ త్రీ 120 రూపాయల ఖరీదు తో కెమెరాను కనుక్కొని దానితోనే అవుట్డోర్ ఫోటోగ్రఫీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. 1983 జనవరి సంవత్సరంలో దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగంలో చేరిఅప్పటినుండి 1985 వరకు మరికొన్ని కెమెరాలతో అవుట్డోర్ ఫోటోగ్రఫీ చేస్తూ 1986లో యషీక ఎఫెక్ట్స్ త్రీ జూము కెమెరా చెన్నైలో 36 వేలకు కొనుగోలు చేసి కాజీపేట మండలం దేవాపూర్ లోఇన్ ఇండోర్ ఫోటోగ్రఫీ ఫోటో స్టూడియో ను ప్రారంభించిన జరిగిందని తెలియజేశారు. 1987 నుండి 1998 వరకు లతా ఫోటో స్టూడియో గా కొనసాగిస్తూ 98లో డిజిటల్ ఫోటోగ్రఫీ శిక్షణ గుంటూరులో నేర్చుకోవడం జరిగిందని ,1999 సంవత్సరంలో రాజమండ్రి పాపికొండల్లో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీలో 144 మంది ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నప్పటికీ రాష్ట్ర ఉత్తమ ఫోటోగ్రాఫర్ గా అవార్డును అందుకున్న రాని, 2000 సంవత్సరంలో కరీంనగర్ జిల్లా ఎనగందులలో జరిగిన రాష్ట్ర ఫోటోగ్రఫీ పోటీలలో మరోసారి అవార్డునందుకొని, సూర్యాపేట జిల్లాలో 2001 సంవత్సరంలో రాష్ట్ర ఫోటోగ్రఫీ పోటీలలో రెండవ స్థానాన్ని కైవశం చేసుకున్న మనోహర్ స్వామి ఎంతోమంది ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తూ వరుసగా ఓకే జిల్లా నుండి రాష్ట్ర అవార్డులు అందుకున్నందుకు ఎంతోమంది ప్రజా ప్రతినిధులు అభినందించారు. 2002 నుండి 2005 వరకు జరిగిన జిల్లాస్థాయి పోటీలలో 5 అవార్డులను గెలుచుకోవడం జరిగింది. ఓరియంట్ సిమెంట్ కర్మాగారంలో ఐ ఎస్ ఓ 90002 సర్టిఫికెట్ పొందటానికి కర్మాగారం ఫోటోలను జపాన్ కు పంపించేందుకు ఎంతో మంది ఫోటోగ్రాఫర్లు పోటీ పడినప్పటికీ కూడా కర్మాగారం ఉపాధ్యక్షులు భగవత్ పాండే మనోహర స్వామిని ఎంపిక చేసి ఫోటోలను జపాన్ కు పంపించడం జరిగిందన్నారు 1987 నుండి2012 వరకు ఓరియంట్ సిమెంట్ కర్మాగారంలో ఫోటోలు తీసిన ఘనత, వివాహ శుభకార్యాలకు సుదూర ప్రాంతాలలో ఫోటోగ్రఫీ చేసి ఎంతోమంది ప్రముఖులతో మన్ననలు పొందిన ఫోటోగ్రాఫర్ మనోహరస్వామిని మంచిర్యాల జిల్లా ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అప్పటి ఆర్డీవో మూర్తి పలువురు ప్రముఖులు ఓరియంట్ సిమెంట్ కర్మాగారం అధికారులు ఫోటోగ్రఫీ విషయంలో ప్రశంసల వర్షం కురిపించారు ఇంతటి ఉత్తమ ఫోటోగ్రాఫర్ కి పి సి డబ్ల్యూ న్యూస్ సీఈవో పాష మరియు పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్టులు అందరూ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా అభినందనలు తెలియజేస్తున్నారు. మిగతా వారందరూ కూడా ఫోటోగ్రాఫర్ మనోర స్వామికి అభినందనలు తెలియజేయండి.

## కలకత్తాలో మెడికో పై గ్యాంగ్ రేప్, హత్యకు వ్యతిరేకంగా ర్యాలీ




**జవహర్ నగర్, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొన్నే సావిత్రి అధ్యక్షతన చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో బి జె ఆర్ నగర్ అంబేద్కర్ సెంటర్ నుండి నందమూరి నగర్ వైఎస్సార్ స్టాచు వరకు పెద్ద మహిళలు పాల్గొన్నారు హత్యలు హత్యాచారాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ తీసినారు. ఈ ర్యాలీలో ఐ పి ఓ డబ్ల్యు తెలంగాణ సెక్రటరీ పెరక సునీత, చైతన్య మహిళా సంఘం నాయకురాలు గిరిజ, విజయాలు మరియు బస్తీ మహిళలు పాల్గొని విజయవంతం చేసినారు.

## రాఖీ వేడుకల్లో బోయిపల్లి వినోద్ కుమార్....



**కరీంనగర్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్కి కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ మహిళ కార్యకర్తలు రాఖీ కట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మహిళలందరికి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్ర రాధ, గంటల రేణుక, వొల్లాల వాణి, రోజా, శోభ తదితరులు పాల్గొన్నారు.

## సుభాస్ చంద్రబోస్ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



**చిట్యాల, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన సుభాస్ చంద్రబోస్ ఆశయాలను నేటి యువత ఆయన ఆశయాలను కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్ అద్యక్షతన సుభాస్ చంద్రబోస్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. సుభాస్ చంద్రబోస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, భారతమాత దాస్యశ్రృంఖాలాలకై పోరాటం చేసిన స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని తెలిపారు.

## బిజెపి నేత మాటలు హాస్యస్పదంగా ఉన్నాయి

**● మండల కో ఆప్షన్ మాజీ సభ్యులు మహమ్మద్ రాజ్ మహమ్మద్**



**చిట్యాల, ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** భాజపా శాసనసభ పక్ష నేత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలి అనడం చాలా వింతగా ఆసిస్పందంగా ఉందని మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు అన్నారు. ప్రతిపక్ష పార్టీలైన బిజెపి బి ఆర్ ఎస్ నాయకులకు తగదని అన్నారు గత సంవత్సరం వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన మాట కోసం రైతులకు. రెండు లక్షల వరకు రుణమాఫీ మా ప్రభుత్వం వచ్చిన తర్వాత చేస్తామని కాంగ్రెస్ పార్టీ లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట కోసం తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జులై 18 తారీఖున నుండి ఆగస్టు 15 తారీకు లోపల రెండు లక్షల వరకు రైతులకు ఉన్న రుణాలను మాఫీ చేసినందుకా కాంగ్రెస్ పార్టీ రైతులకు క్షమాపణ చెప్పాలా 22 లక్షల మంది రైతులకు 17వేల 9 00 కోట్ల రూపాయలు నెల రోజుల లోపలనే రైతుల ఖాతాలో వేసినందుకు క్షమాపణ చెప్పాలా ఎవరికైతే అర్హత ఉండి రైతులకు రుణమాఫీ కాలేదో అట్టి వారికి ప్రభుత్వమే ఒక యాప్ ద్వారా మండలంలో ఉన్నటువంటి రైతువేదికలోని అధికారులైన ఏవో కి అప్లికేషన్ ఇవ్వగలరని స్వయంగా ముఖ్యమంత్రి ప్రభుత్వ అధికారులు తెలియజేస్తున్నారుద. కాంగ్రెస్ తెలంగాణలో అధికారానికి వచ్చిన తర్వాత రైతులకు ప్రాముఖ్యతనిచ్చి ప్రజా పరిపాలన చేస్తు మహిళలకు ఉచిత బస్ పాస్ 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు వంటింటి గృహిణులకు 500 రూపాయలకే వంట గ్యాస్ లాంటి సంక్షేమ పథకాలను చేయడం వలన ప్రతిపక్షాలు ఊర్వలేక పైగా ప్రభుత్వాన్నే క్షమాపణ చెప్పాలని అనడం హాస్యాస్పదంగా విడ్డూరంగా ఉంది ముఖ్యంగా రాబోయే పంచాయతీ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీకే ప్రజలుపట్టం కడతారని తెలిసి ఈ విధంగా మాట్లాడుతున్నారని మండల కో ఆప్షన్ మాజీ సభ్యులు మొహమ్మద్ రాజ్ మహమ్మద్ ఈరోజు చిట్యాల మండల కేంద్రంలో ఒక ప్రకటనలో తెలియజేశారు.

## బాల్యమిత్రుడు కుటుంబానికి ఆర్థిక చేయూత


**చిట్యాల, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలోని కైలాపూర్ గ్రామానికి చెందిన చింతల శైలేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మృతుడి బాల్యమిత్రులు జమ చేసిన రూ. 17 వేల రూపాయల నగదును మృతుడి కుమార్తెలు శ్రీజ, శ్రీనిధిలకు అందజేశారు. రానున్న రోజుల్లో మృతుడి కుమార్తెల పైచదువుల నిమిత్తం అండగా ఉంటామని మిత్రులు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాధరి రాజు మోత్కూరి శ్రీశైలం, చింతల కృష్ణ, బోల్ల రాజేందర్, ఆకుల సతీష్, , గంపల మధుకర్, తుమ్మల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఏసిబికి చిక్కిన గుంజేడు ముసలమ్మా ఇఓ

**- పూజ సామాగ్రి దుకాణం యజమాని నుండి ఇరవై వేలు లంచం తీసుకుంటు పట్టుబడిన ఇ ఓ బిక్షమా చారి**

**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లోని గుంజేడు ముసలమ్మా జాతర ఈఓ బిక్షమా చారి లంచం తీసుకుంటు ఆదివారం ఏ సి బి కి పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే గుంజేడు ముసలమ్మా జాతర లో పూజ సామాగ్రి దుకాణం దారుడు సాంబయ్య కు రూ. 20000 రూపాయల లంచం డిమాండ్ చేయడంతో ఏ సి బి ని ఆశ్రయించినట్లు తెలిసింది. పక్క ప్రణాళికతో ఆలయ అధికారి బిక్షమా చారి పూజ సామగ్రి దుకాణం యజమాని సాంబయ్య నుండి రూ. 20000 రూపాయలు తీసుకుంటు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఏసిబి శాఖ డిఎస్పి సాంబయ్య మాట్లాడుతూ.. గుంజేడు ఆలయ ఈఓ బిక్షమా చారి పూజ సామాగ్రి యజమాని నుండి రూ. 20000 డిమాండ్ చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం గుంజేడు ఆలయం లో బిక్షమా చారి 20000 తీసుకుంటుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆలయ ఇఓ ను అదపు లోకి తీసుకొని ఏసిబి కోర్టులో హాజరుపరుస్తామని అన్నారు. ఎవరైనా అధికారులు లంచాలు అడిగితే ఏసిబి అధికారులకు సమాచారం అందించాలని కోరారు. డిఎస్పి వెంట సిఐ లు శ్యామ్, రాజు సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

**చిట్యాల, ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో బిజెపి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు అనూప మహేష్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించడం జరిగింది అనంతరం చిట్యాల బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ దొరల అహంకారాన్ని పాల ద్రోలి బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలని ఒక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని మొగలలను నిజాం నిరంకుశ పాలన కొంతమంది నుంచి అనేక కోటలను ఆక్రమించి బడుగు బలహీన వర్గాలు రాజ్యాధికారం సాధించుకోవాలని పిలుపునిచ్చిన గొప్ప మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారుబడుగు బలహీనవర్గాలు ఒకటి అవుతున్నాయని అనేక ఉద్యమాలు చేసి మనకోసం ప్రతాపించిన వ్యక్తి అయినా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించాలని అన్నారు కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గుండ సురేష్, జిల్లా మండల నాయకులు కంచ కుమారస్వామి ,వల్లాల ప్రవీణ్ , సాద సదానందం కేం సారప్పు ప్రభాకర్, గోపగాని రాజు ,మైదాం శ్రీకాంత్, చింతల రాజేందర్, మర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ముగిసిన తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికలు





**సంగెం, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగెం మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో ఆదివారం రోజు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు టీఆర్పీఎస్ ఎన్నికలు జరిగినాయి. సంగెం మండలంలోని పద్మశాలిలు 630 ఓటర్లు గా నమోదుశేసుకొన్నారు. ఈ సందర్భంగా సంగెం మండల పద్మశాలీ సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ... 571 మంది పద్మశాలి లు ఓటర్లు తమ ఓటు హక్కు ను వినియోగించారు అని అన్నారు. మొదటిసారి పద్మశాలి సంఘం ను రాష్ట్ర ప్రభుత్వంతో ఆమోదిచబడినది. ఈ ఓటింగ్లో అధిక సంఖ్యలో పోల్గొన్నపద్మశాలి కులబాంధవ్యులకు సంఘం అధ్యకుక్షులకు, పోలింగ్ కు సహకరించిన సంగెం పోలీస్ వారికి దన్యవాదములు అని అన్నారు.పోలింగ్ శాతం 90 పర్సెంటేజ్ నమోదు అయినది అని అన్నారు.

## మాధురికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** భీమారం చింతగట్టు క్యాంపు సమీపం నందు 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంక హరిబాబు అక్క మాధురి సంవత్సరికం లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

## దుచ్చర్యలకు పాల్పడకండి .. నాయకులారా .. ప్రజాప్రతినిధులారా సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలారా .. ఇకనైనా ఆలోచించండి..

**కరీంనగర్ టౌన్, ఆగస్ట్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలో సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలారా ఇటువంటి పిచ్చి పనులు చేయకండి, గుర్తింపు అనేది ఒక నాయకుడు గుర్తిస్తే వచ్చేది కాదు, పార్టీలు మారిన వారు నాయకుల దగ్గర జోకుతూ ఉంటారు, ఈ పార్టీ కాపోతే వాళ్లకు ఏ పార్టీ అయినా దొరుకుతుంది, కానీ సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీని నమ్ముకొని ఉన్నవాళ్లు పార్టీ కోసం పనిచేసిన వాళ్ళు ఇలాంటి దారుణానికి పాల్పడితే మన కుటుంబాలకు మనం తీరని అన్యాయం చేసిన వాళ్ళం అవుతాము, దయచేసి ఇలాంటి దుచ్చుర్యలకు పాల్పడకండి, నాయకులారా , ప్రజాప్రతినిధులారా, ఇకనైనా ఆలోచించండి, పార్టీలు మారిన వారిని భుజాల మీద ఎక్కించకండి, పార్టీ కోసం గత పది సంవత్సరాలుగా ప్రతిపక్షంలో ఉండి ధర్నాలు, రాస్తారోకోలు, పోలీస్ కేసులు పెట్టించుకున్న కార్యకర్తలను గుర్తించండి, అంతేగాని ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి జెండా మోసినట్టుగా నటించే వాళ్లను కాస్త దూరం పెట్టండి, ఈరోజు మీ దగ్గరికి వచ్చి మిమ్మల్ని జోకుతున్నారు, రేపు మీరు ఓడిపోగానే ఇంకొకరు గెలుస్తారు వాళ్ల దగ్గరికి వెళతారు, కానీ మిమ్మల్ని నమ్ముకున్న వాళ్ళు మీతోనే ఉంటారు, దయచేసి వాళ్ళ గురించి ఆలోచించి పార్టీలో పదవులు గాని నామినేటెడ్ పోస్టులు గానీ కార్పొరేటర్ టికెట్లు గాని ఇవ్వండి, అని పార్టి నాయకుడిగా పార్టి కోసం అన్ని విధాలుగా సేవ చేసిన అధికారులు పట్టించుకోక పోవడంతో పార్టి కార్యకర్త తన భాదను వెళ్ళబుచుకున్నాడు.



## డాక్టర్ మౌమీత పై అత్యాచారం, హత్య చేసిన దుండగులకు ఉరిశిక్ష విధించాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్




**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** మహిళల రక్షణ కోసం తీసుకొచ్చే చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, ఒక డాక్టర్ కు రక్షణ కల్పించలేని ప్రభుత్వం సామాన్య మహిళలకు ఏం రక్షణ కల్పిస్తుందని, వెంటనే డాక్టర్ మౌమీత పై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులకు ఉరిశిక్ష విధించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ అన్నారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో పశ్చిమ బెంగాల్ కలకత్తాలోని ఆర్ జి కార్ మెడికల్ కాలేజీలో 9వ తేదీన దుండగులు జూనియర్ డాక్టర్ మౌమీత పై అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన కు నిరసనగా సిపిఐ నర్సంపేట మండల సమితి ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా పంజాల రమేష్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున డాక్టర్ పై అత్యాచారం హత్య ఉన్న స్థానంలో ఉన్న అధికారులు సంఘ విద్రోహ శక్తుల తోటి చేతులు కలిపి డ్రగ్స్ సెక్స్ మాఫియాతో చేతులు కలిపి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్టు వార్తలు వస్తున్నాన ఈ ఇలాంటి వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని మళ్లీ ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు చేపట్టాలని ఇలాంటి చర్యలకు పాల్పడే ఎలాంటి వారినైనా కఠినంగా శిక్షించాలని మహిళలకు రక్షణ కల్పించడంలో ఎన్ని చట్టాలను తీసుకొచ్చిన అవి తాత్కాలికంగా ప్రచార ఆర్భాటాలకు పనిచేస్తున్నాయి తప్ప మహిళలకు రక్షణ కల్పించడంలో చట్టాలు విఫలమవుతున్నాయని ఇప్పటికైనా మహిళలకు రక్షణ కల్పించడంలో తగు చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్క పెల్లి రమేష్ నర్సంపేట మండల కార్యదర్శి గడ్డం యాకయ్య ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐత యాకుబ్ సిపిఐ నాయకులు గడ్డం నాగరాజు పిట్టల సతీష్ హంస మంజుల చెటే మమత వడ్లకొండ యశోద ఐత శ్రీ కల కమ్మల అరుణ ఎండి సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## నలభై ఐదు శాతం మందికే రుణమాఫీ చేశారు... మిగతా రైతులకు సర్కారు శఠగోపం పెట్టొద్దు

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్



**కరీంనగర్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 9 న రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన 8 నెలలకు 45 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు.ప్రభుత్వం మొదట 41వేల కోట్లు రుణమాఫీ కి అవసరమని చెప్పి ,కేబినెట్ భేటీలో 31 వేల కోట్లు అన్నారు.ఇప్పుడు కేవలం 17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలి.కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోయకపోవడంతో ఇప్పుడు ఉత్తర తెలంగాణ ఎడారిగా మారే అవకాశం ఉంది.ఇప్పటి వరకు 60 శాతం మాత్రమే పంటలు సాగు చేశారు.కొన్ని జిల్లాల్లో 40శాతం కూడా పంటలు సాగు చేయలేదుఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఈ ఖరీఫ్ సీజన్ లో పంటల సాగు తగ్గింది.. వచ్చే యాసంగి సీజన్లో కనీసం 20నుంచి 30శాతం కూడా పంటల సాగు అయ్యే అవకా శం లేదు.పదేళ్లు తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ ఉన్నన్ని రోజులు ఎర్రటి ఎండల్లో కూడా చెరువులు మత్తలు దూకాయికాంగ్రెస్ ఎనిమిది నెలల పాలనలో వర్షాకాలంలో కూడా చెరువుల్లో చుక్క నీరు లేకుండా పోయింది.తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం పంపులను ఆన్ చేసి ప్రాజెక్టులన్ని నింపాలి.

## రుణమాఫీపై భగ్గుమన్న ఆదిలాబాద్


**- రేవంత్ దిష్టిబొమ్మతో శవయాత్ర**

**ఆదిలాబాద్, ఆగస్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** రూ.రెండు లక్షల రూణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండోరోజైన ఆదివారం కూడా రైతుల ఆందోళనలు కొనసాగాయి. జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం కేంద్రంతోపాటు తలమడుగు మండలం రుయ్యాడి, బేల మండలం సిర్సన్న, భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామాల్లో రైతులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బజార్‌హత్నూర్, రుయ్యాడిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో డప్పుచప్పుళ్ల నడుమ పటాకులు కాలుస్తూ శవయాత్ర నిర్వహించారు.అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. సిర్సన్న, పిప్పల్‌కోటి గ్రమాల్లో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.



## బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్



**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ బహుజన వీరుడు, ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక అని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమాన్ని బాలసముద్రం పార్టీ ఆఫీసు కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. సర్వాయి పాపన్న జయంతి, వర్ధంతిని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారికంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. కుల, మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కాలనే సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాటి కాలంలోనే పాపన్నగౌడ్ పోరాడడం గొప్ప విషయమన్నారు. పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో రాజ్యాధికారం కోసం బహుజనులందరం పోరాడుదామని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ మేకల బాబురావు, నాయకులు రఘు, రామ్మూర్తి, వెంకన్న, మహేష్, సారంగపాణి, గౌడ సంఘం నాయకులు సదాంత్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, విద్యార్థి నాయకులు శరత్, వీరు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కోల్కతా డాక్టర్ మౌమిత దెబ్‌నాత్‌పై జరిగిన అమానవీయ సంఘటనకు పాల్పడిన (గ్యాంగ్ రేప్, హత్య) దోషులను కఠినంగా శిక్షించాలి









**హనుమకొండ జిల్లా,ఆగస్టు 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** కోల్కతా డాక్టర్ మౌమిత దెబ్ నాత్ గారి పై జరిగిన అమానవీయ సంఘటనకు పాల్పడిన (గ్యాంగ్ రేప్, హత్య) దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సమ్మయ్య నగర్ అభివృద్ధి కమిటీ మరియు ప్రతాపరుద్ర యూత్ ఆద్వర్యం KU క్రాస్ రోడ్ జంక్షన్ వద్ద రాస్తారోకో, ధర్నా నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో సమ్మయ్య నగర్ అభివృద్ధి కమిటీ నాయకులు ప్రతాపరుద్ర యూత్ సంఘం సభ్యులు మహిళలు అందరూ పాల్గొని విజయవంతం చేశారు మహిళా డాక్టర్ కు జరిగిన సంఘటన మరొక్కసారి జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని మరియు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లపల్లి సుధాకర్, రావుల నరసింహ చిట్యాల యాకయ్య, జే.గోపాల్, డెంగు దామోదర్, జిలకర స్వామి, రావుల వెంకన్న, తౌటం గోపాల్ ,కె.ప్రభాకర్ దేవర రవి,పులిచేరు కుమార్,పద్మ, జిల్లపల్లి రమాదేవి, జిల్లపల్లి అనుష, పొలస నరమ్మ, సౌజన్య తౌటం ఎల్లమ్మ ,అలిముల ప్రమీల, సరిత దీప తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా కూనూరు రంజిత్

- అభినందనలు తెలిపిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్, హన్మకొండ జిల్లా న్యాయస్థానం లో న్యాయవాది గా ప్రాక్టీస్ చేస్తున్న కూనూరు రంజిత్ కి టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ గా నియమిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నిమ్మని శేఖర్ రావు, రాష్ట్ర కన్వీనర్ ముద్దసిర్ అహ్మద్ ఖయ్యూమ్ ఆధ్వర్యంలో నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కన్వీనర్ కూనూరు రంజిత్ గతంలో విద్యార్థి నాయకుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా,గత ప్రభుత్వంపై సామాజిక, న్యాయవాదుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసినందుకు, ప్రజాప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి అసెంబ్లీ ,ఎంపీ,ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పనిచేసి గెలిపిచడంలో క్రియశీలా పాత్ర వహించినందుకుఅభినందిస్తూ నన్ను రాష్ట్ర కన్వీనర్ గా నియమించినందుకు, కాంగ్రెస్ పార్టీని,లీగల్ సెల్ ను మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం పార్టీ ఆదేశాలను తు.చా తప్పకుండ పాటిస్తానని, లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ కి, సీఎం రేవంత్ రెడ్డి కి,మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, మధుయాష్కీ, ఎమ్మెల్యే నాగరాజు,నిమ్మని శేఖర్ రావు, కోట శ్రీనివాస్, సాయిని నరేందర్, పరసురాజ్ కు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులకు, న్యాయవాదులకు కూనూరు రంజిత్ కృతజ్ఞతలు తెలిపారు.

